www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 నవంబర్ 2022



అల్పపీడనంతో ముసురువాన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అల్పపీడనం ప్రభావంతో తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో తెల్లవారుజాము నుండి ఓ మోస్తారుగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. ఎక్కడికక్కడ డ్రైనేజీలు, కాలువలు పొంగి పొర్లుతుండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తిరుపతి జిల్లాలో నవంబర్ నెలకు 288.9 మిల్లీమీటర్స్ పడాల్సి ఉండగా ఇప్పటివరకు 256.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

అప్పుల 'సేద్యం'

ఏటా పెరుగుతున్న 'సాగు ఖర్చులు'
ఆర్బీకేల్లో దొరకని ఎరువులు, విత్తనాలు
పేట్రేగిపోతున్న ప్రైవేట్ దందా
నిద్రావస్థలో వ్యవసాయ శాఖ

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి

" రైతూ..రైతూ..రైతో..!! పాడుగాను నీ రాతో..!! మెతుకు మెతుకు పై నీ పేరున్నా..వెతుకులాట నీ బతుకు..చివరకు చేరుతుంది ఏ చితికో..!! నువ్వు పండించే ధాన్యమే..ఆ దేవుడి గుడిలో ప్రసాదం..!! ఆ దేవుడికెందుకు తెలియదు నీ ఇంట్లో ఉన్న విషాదం..!! కళ్ళకద్దుకొని తింటారే..నీ కన్నీళ్లు లెవరూ బాపరే..!! అంటూ ఇటీవల విడుదలైన ఓ విషాద జానపద గేయాన్ని తలపిస్తున్నాయి రైతు కష్టాలు. ప్రకతి విపత్తులను తట్టుకుని, సాగు కష్టాలను దాటుకుని, ఆరుగాలం శ్రమిస్తూ దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతకు ఆపన్నహస్తం అందించేవారు కరువవుతున్నారు. పెట్టుబడి సాయం, ఇన్ పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం, ఏటా సాగు ఖర్చులు పెరిగిపోతుండడంతో అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో ఇప్పటికే 50 శాతం వరి నాట్లు పూర్తికావస్తున్నా రైతుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. రైతుకు భరోసా ఇస్తామన్న కేంద్రాలు(ఆర్బీకేలు) అక్కరకు రాకుండా పోతుండటం బాధాకరం.

ఆర్బీకేల్లో దొరకని ఎరువులు, విత్తనాలు

రబీ సీజన్‌కు సంబంధించి శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో 25 నుంచి 30 వేల హెక్టార్లలో వరిని పండించడం సాధారణం. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వర్షాలు సమద్ధిగా కాకున్నా అవసరమైన మేరకు పడటం, అందుబాటులో తెలుగు గంగ నీళ్లు ఉండడంతో అక్టోబర్లోనే తూర్పు మండలాల రైతులు పొలంబడిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే 50 శాతం వరినట్లు పూర్తికావచ్చాయి. అయితే ఇప్పటివరకు రైతుల డిమాండుకనుగుణంగా విత్తనాలను, కాంప్లెక్స్ ఎరువులను, యూరియాను అందుబాటులో ఉంచడంలో వ్యవసాయశాఖాధికారులు విఫలమయ్యారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 90 రైతు భరోసా కేంద్రాలు ఉండగా, 10 శాతం ఆర్బికేల్లో కూడా ఎరువులు విత్తనాలు, అందుబాటులో లేవని రైతులు మండిపడుతున్నారు. సాధారణంగా రబీకి సంబంధించి సుమారు 3 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల అవసరం ఇక్కడి రైతులకుంది. అయితే ఇప్పటివరకు 600 మెట్రిక్ టన్నుల ఎరువులు మాత్రమే ఆర్బికేలకు చేరినట్లు సమాచారం. అదేవిధంగా రైతుల్లో విత్తనాల డిమాండ్ ఉన్నా ఆర్బీకేల్లో సున్నా శాతం నిల్వలున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కేంద్రం ఎరువుల ధరలు తగ్గించినా రైతు భరోసా కేంద్రాల్లో మాత్రం ఆన్లైన్ ధరలకంటే రూ.100 అదనంగా విక్రయిస్తున్నారన్న విమర్శలున్నాయి.

పేట్రేగిపోతున్న ప్రైవేట్ దందా..!!

ఒకవైపు రైతు భరోసా కేంద్రాలను ప్రోత్సహిస్తామంటున్న ప్రభుత్వం.. మరోవైపు ప్రైవేట్ ఫెర్టిలైజర్ దుకాణాలను ఎర్ర తివాచీ పరుస్తోందన్న విమర్శలున్నాయి. ప్రైవేట్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల నిల్వలు కళకళలాడుతుండడం..ఆర్బికేల్లో నిండుకుండటం ఇందుకు నిదర్శనం. దీంతో ప్రైవేట్ వ్యాపారులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను తమకిష్టమొచ్చిన ధరలకు అమ్ముకుంటూ రైతులను దగా చేస్తున్నారు. గత ఏడాది యూరియా కృత్రిమ కొరతను సష్టించి ప్రైవేట్ వ్యాపారులు రైతులను దోచుకున్న సంగతి తెలిసిందే. అయితే ప్రైవేటు దుకాణాల్లో పెద్ద ఎత్తున దందా జరుగుతున్నా.. రైతులు మోసపోతున్నా వ్యవసాయశాఖాధికారులు నిద్ర నటిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

బీడు పెట్టలేకే వ్యవసాయం



నాగరాజు, రైతు, మన్నవరం

ఆరుగాలం కష్టపడి వరి పండించినా మిగిలేదేమీ లేదు. పొలాన్ని బీడు పెట్టలేకే కష్టమైనా పంట పెడుతున్నాం. ఎకరా పొలంలో వరి సాగు చేసేందుకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. పంట పండాక ధాన్యం అమ్మితే రూ.30 నుంచి రూ.40 వేలే వస్తోంది. ఆ వచ్చిన మొత్తం అప్పులకే పోగా, మూడు నెలల కష్టానికి ప్రతిఫలం సున్నా.

ఆర్బికేలను పటిష్టపరచాలి

పెనగడం గురవయ్య, వ్య.కా.సం నాయకుడు

ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం లేదు. ప్రైవేట్ దుకాణాలకు టన్నుల కొద్దీ సరఫరా చేస్తున్న ప్రభుత్వం ఆర్బికెలను నిర్లక్ష్యం చేయడంలో ఆంతర్యమేంటి? ప్రైవేట్ దుకాణాల నుంచి అధికారులకు మామూళ్లు అందుతుండడం వల్లే ఇలా జరుగుతోంది.



ఏటేటా ఎరువుల ధరలు భారం

	2020	2021	2022
యూరియా	రూ.220	రూ.260	రూ.300
20-20-013 (కాంప్లెక్స్)	రూ.వెయ్యి	రూ.1400	రూ.1350
డీఏపీ	రూ.వెయ్యి	రూ.1350	రూ.1400
పొటాస్ (ఎంవోపీ)	రూ. 800	రూ.900	రూ.1700
10-26-26	రూ.వెయ్యి	రూ.1250	రూ.1470
15-15-15	రూ.వెయ్యి	రూ.1150	రూ.1500





వర్షపు నీటిని బకెట్ ద్వారా పడుతున్న వైనం

ఆగని'వాన'... ఆస్పత్రి 'లోన'

శిథిలావస్థలో ప్రభుత్వ ఆస్పత్రి భవనం
బకెట్లతో నీటిని పట్టి పారబోయాల్సిందే
వర్షపు నీటితో సిబ్బంది, రోగుల వ్యథలు
నూతన భవనానికి మోక్షం ఎపుడో..?

ప్రజాశక్తి - ఓజిలి

అల్పపీడన ప్రభావం ముసురువాన మామూలే.. అయితే ఆస్పత్రి లోన కూడా ఈ అల్పపీడన ప్రభావం కనిపిస్తోంది. ఆస్పత్రి గోడలన్నీ చెమ్మతో కరెంట్ స్విచ్ వేయాలంటే భయపడే పరిస్థితి. వర్షంతో ఫ్లోరింగ్ అంతా తడిచిపోయింది. ఆస్పత్రి లోపల పొడిగా ఉన్న ప్రాంతాన్ని వెతుక్కోవాల్సిన పరిస్థితి. భవనం శిథిలావస్థలో ఉండడంతో ఈ పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు. వర్షం పడిందంటే వాతావరణ ప్రభావం రోగులు ఎక్కువగా వస్తారని, అయితే విధులు నిర్వహించాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం వెంటాడుతుందని 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుని అస్తవ్యస్తంగా మారింది. భవనం మొత్తం ఉరుస్తుండడంతో వర్షం నీటి మద్యనే సిబ్బంది నానా యాతన పడుతున్నారు. వైద్య సామగ్రి పూర్తిగా గడిచి మరమ్మతుకు గురవుతున్నాయి. కళ్లెదుటే సామగ్రి తడిచిపోతున్నా సిబ్బంది ఏమీ చేయలేని పరిస్థితి. వర్షపు నీటిని బకెట్ల ద్వారా పట్టి బయటకు పోస్తున్నారంటే దయనీయ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆస్పత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా రోగులకు సరైన వసతులను కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం మంజూరయ్యి రెండేళ్లవుతున్నా నూతన



భవన నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. నూతన భవనం స్లాబ్ వేసి నెలలు గడస్తున్నా గుత్తేదారుడు నిర్మాణ పనులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ఉన్న పాత ఆస్పత్రి భవనంలోనే అరకొర సౌకర్యాలతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు అత్యవసర పరిస్థితుల్లో సెలైన్ ఎక్కించాలన్నా ప్రత్యేక గదులు లేక బహిరంగంగానే సెలైన్ పెట్టే పరిస్థితి ఉంది. నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

24న జిల్లా సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈనెల 26వ తేదీన కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా సమీక్షా సమావేశం జరగనున్న నేపథ్యంలో ముందస్తుగా నివేదికలు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖలకు సంబంధించిన పురోగతి, వాటి అమలులో ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదికతో హాజరుకావాలని సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని, గతంలో డిఆర్‌సిలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను వారికి నివేదించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ప్రణాళికా అధికారి అశోక్‌కుమార్, ద్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయ్‌కుమార్, డిఎంహెచ్ఒ శ్రీహరి, డిఇఒ శేఖర్ పాల్గొన్నారు.

పాడి రైతులకు 'అమూల్' శుభవార్త

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

పాడి రైతులకు అమూల్ డెయిరీ శుభవార్త అందిస్తోందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి చెప్పారు. జగనన్న పాల వెల్లువలో భాగంగా 24వ తేదీ గురువారం నుంచి పాల సేకరణ ధరలను అమూల్ డెయిరీ పెంచినట్లు పేర్కొన్నారు. ఆవుపాలు వెన్న శాతం బట్టి గతంలో లీటర్‌కు 30.50 రూపాయలు ఇస్తుంటే, ప్రస్తుతం 32.13 రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించారు. లీటర్‌పై 1.63 రూపాయలు ధర పెరిగింది. అలాగే గేదెపాలు లీటర్ వెన్న శాతం బట్టి రూ.42.50 ఉంటే, ప్రస్తుతం 44.97 ఇవ్వనున్నారు. 2.47 రూపాయలు పెంచి ఇస్తున్నట్లు చెప్పారు. సంఘ నిర్వహణ ఛార్జీలు బిఎంసియు స్థాయి నాణ్యత ఆధారంగా గతంలో 7.90 రూపాయలు ఇస్తుండగా, ప్రస్తుతం 9.50 రూపాయలు ఇవ్వనున్నారు. పెరిగిన ధరలు రాయలసీమ ప్రాంతంలోని అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, వైఎస్ఆర్ కడప, తిరుపతి జిల్లాలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి సంవత్సరం దీపావళి పండుగ సందర్భంగా ఏడాదిలో కనీసం 180 రోజులు పాలు పోసిన రైతులకు ప్రతి లీటర్‌కు అర్ధ రూపాయి బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేయనుంది. 2021లో 3,610 మంది పాడి రైతులకు 25 లక్షలు, 2022లో 6880 పాడి రైతులకు 70 లక్షలు బోనస్‌ను రైతుల ఖాతాలో జమ చేసింది. ప్రస్తుతం అమూల్ డెయిరీ వైఎస్ఆర్ కడప, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోజుకు 70వేల లీటర్ల పాలసేకరణ చేస్తున్నారు.

కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

అంగన్‌వాడీ జిల్లా మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్/ తిరుపతి సిటి

కనీస వేతనం రూన.26 వేలిచ్చేలా భవిష్యత్‌లో పోరాటాలను ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు వాణీశ్రీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఉద్ఘాటించారు. తిరుపతి జిల్లా అంగన్‌వాడీ యూనియన్ మహాసభ తిరుపతిలో జిల్లా అధ్యక్షురాలు హెప్సిబా అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ముందుంటానని పదేపదే ప్రచారం చేశారని, తీరా అధికారంలోకి వచ్చాకా పట్టించుకోవడమే మానేశారన్నారు. తెలంగాణా రాష్ట్రం కంటే అధిక వేతనాలు ఇస్తామని చెప్పి ఆచరణలో మాట తప్పారన్నారు. పోషణా ట్రాకింగ్ యాప్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాప్‌లతో విపరీతమైన పనిభారం పెంచారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో మెనూ ఛార్జీలు పెంచకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్టర్లు నాశిరకమైన వస్తువులను అందిస్తే అంగన్‌వాడీ సిబ్బందిపై చర్యలు తీసుకోవడం, నోటీసులు ఇవ్వడం వేధింపు చర్యల్లో భాగమన్నారు. రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వ



ప్రసంగిస్తున్న యూనియన్ నాయకురాలు వాణీశ్రీ

హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులు తాళలేక వైసిపిని బలపరచినందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు గతం కంటే ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బాలసుబ్రమణ్యం, 11 ప్రాజెక్టులకు చెందిన యూనియన్ నేతలు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం పనులు పరిశీలన

తిరుపతి టౌన్ : తుడా మైదానం పక్కన జరుగుతున్న ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి స్మార్ట్‌సిటీ ఎమ్‌డి అనుపమ అంజలి అన్నారు. బుధవారం పనులను ఆమె పరిశీలించారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అనుపమ అంజలి మాట్లాడుతూ ఆరు కోట్ల రూపాయలతో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మిస్తున్న ఈ ఇండోర్ స్టేడియంలో షటిల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, జిమ్నాయిజం కోర్టులు ఆడేందుకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వస్తే క్రీడాకారులకే కాకుండా తిరుపతి ప్రజలకూ ఓ మంచి ఇండోర్ క్రీడా సముదాయం ఉత్సాహాన్ని కలిగిస్తుందని తెలిపారు. రెండు నెలల్లోపు ఈ స్టేడియంను అందుబాటులోకి తెచ్చేలా పనులు పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఎయికామ్ సంస్థ బాలాజీ పాల్గొన్నారు.

తోపుడుబండి వద్దనే మోహిత్‌రెడ్డి అల్పాహారం

ప్రజాశక్తి - తిరుపతి

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్రంలో సీఎం జగనన్న అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుందని తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు చేర్చడంలో సిఎం జగనన్న సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. బుధవారం వేదాంతపురం పంచాయతీలో గడప గడపకూ మహాపాదయాత్ర కొనసాగింది. ఎంపిపి పర్యటించిన వినాయకనగర్, బాయమ్మతోటలో ప్రజలు పథకాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వినాయకనగర్‌లో తోపుడుబండి వద్దనే ఎంపిపి టిఫిన్ చేస్తూ వ్యాపారస్తురాలితో ముచ్చటించారు. ఇప్పటికైనా అన్ని విధాల అర్హత కలిగి వుండి ఇంటి కోసం దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు



చేసుకోవాలని సూచించారు. 90 రోజుల్లో ఇంటి పట్టా మంజూరు చేస్తారని వివరించారు. వినాయక నగర్ లో ఆంజనేయస్వామి విగ్రహం నుంచి గంగమ్మ ఆలయం వరకు రహదారి నిర్మాణానికి ప్రజల వినతి మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బాయమ్మతోటలో రూ.10 లక్షల వ్యయంతో నీటి సౌకర్యాన్ని కల్పించారు. వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, సర్పంచ్ తోట చిరంజీవి రెడ్డి, ఉప సర్పంచ్ చెరుకుల జనార్ధన్ యాదవ్, ఎంపీటీసీ చెరుకుల కష్ణవేణి పాల్గొన్నారు.

విభజన హామీల సాధనకై... 26న ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనకు మద్దతుగా తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద సాధన సమితి ఆద్వర్యంలో 26న ధర్నా నిర్వహించాలని అఖిలపక్షం నాయకులు నిర్ణయించారు. బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, ఆర్‌బిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నగేష్, కాంగ్రెస్ నాయకులు మాగంటి గోపాల్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా విభజన చట్టాన్ని అమలు చేయకుండా, సొంత అజెండాను అమలు చేస్తోందన్నారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, మన్నవరం ఫ్యాక్టరీని అభివృద్ధి చేయాలని, విశాఖ రైల్వే జోన్ సాధించడంలో గాని, సిఆర్ఎస్ అభివృద్ధికి నిధులు కేటాయించ లేదన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ పార్టీ బిజెపి మెడలు వంచి విభజన



అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సమావేశం

హామీలను అమలు చేయించడంలో విఫలమయ్యిందన్నారు. కేసులకు భయపడే జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హోదా అజెండాను పక్కన పెట్టేశారన్నారు. శనివారం చేపట్టిన ధర్నాలో ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని సంఘీభావం తెలపాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాధాక్రిష్ణ, సుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, వేణు, ఎన్‌డి రవి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టిటిడి ఆనంద నిలయానికి బంగారు తాపడం

మార్చిలోనే ముహూర్తమా..?

100 కిలోల బంగారం అవసరమని అంచనా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల శ్రీవారి ఆనంద నిలయానికి బంగారు తాపడం పనులకు ముహూర్తం ఖరారైనట్లు సమాచారం. ఆలయ గోపురం పరిస్థితి, మరమ్మతులు, తాపడం పనులు జరిగే సమయంలో బాలాలయం ఏర్పాటు, భక్తులకు దర్శనం ఎలా కల్పించాలనే అంశాలపై అర్చకులు, వేదపండితులు, ఆగమ సలహా మండలి సభ్యులతో చర్చించారు. అయితే ప్రస్తుతం భక్తుల రద్దీ నేపథ్యంలో తాపడం పనులు సాధ్యమేనా? అన్న కోణంలోనూ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అయ్యప్ప భక్తులు, న్యూ ఇయర్, వైకుంఠ ఏకాదశి రద్దీ ఫిబ్రవరికల్లా దాదాపు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో మార్చి నెలలో పనులు మొదలు పెట్టాలని భావించినట్లు సమాచారం.

శ్రీవారి ఆలయ ఆనంద నిలయానికి విజయనగర పాలనలోనే బంగారు రేకులు అమర్చినట్లు తెలుస్తోంది. ఏడుసార్లు బంగారు తాపడం చేశారని తెలుస్తోంది. పలువురు రాజులు, హథీరాంజీ మహంతులు తాపడం చేసినట్లు తెలుస్తోంది. టీటీడీ ఏర్పాటయిన తర్వాత 1933లో ఒకసారి, 1958లో చివరిగా 12 వేల తులాల బంగారంతో బంగారు రేకులను అమర్చారు. నిజానికి 1950లోనే ఆనంద నిలయానికి తాపడం పనులు మొదలైనప్పటికీ వివిధ కారణాలతో దాదాపు ఎనిమిదేళ్లపాటు కొనసాగాయి. ప్రస్తుతం ఆనంద నిలయం కళావిహీనంగా మారుతున్న క్రమంలో మరోసారి బంగారు తాపడం చేయాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఉన్నతాధికారులను బోర్డు ఆదేశించింది. ఆనంద నిలయం బంగారు తాపడంపై ఐదుగురు



సభ్యులతో కూడిన ఆగమ సలహా మండలి ఇచ్చే సూచనలతో ముందుకు సాగాలని టీటీడీ భావిస్తోంది. స్వర్ణ తాపడానికి దాదాపు 100 కిలోల బంగారం అవసరమవుతుందని టీటీడీ అంచనా వేసినట్లు సమాచారం. శ్రీవారి ఆనంద నిలయం బంగారు తాపడం పనులపై ఆగమ సలహా మండలి సభ్యులు పరిశీలిస్తున్నారని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి వెల్లడించారు. ఆగమ సలహా మండలిలో చర్చించిన తర్వాత 2023 మార్చి మొదటి వారంలో బంగారు తాపడం పనులు మొదలు పెట్టే అవకాశాలు ఉన్నాయని పండితులంటున్నారు.

సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ పదవిపై...

ఆశావహుల కన్ను...

త్వరలోనే పదవుల పందేరానికి శ్రీకారం



ప్రజాశక్తి -సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజవర్గంలో నామినేటెడ్ పదవుల పందేరం మొదలయ్యింది. ఇందులో భాగంగానే నియోజవర్గంలోని నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయ చైర్మన్గా ఏవీఎం మునిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోని ధర్మకర్తల మండలి రెండేళ్ల పదవి కాలం నవంబర్ ఐదో తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో కొత్త ధర్మకర్తల మండలి చైర్మన్ పదవి కోసం అధికార పక్షానికి చెందిన పలువురు ఆశావహుల కన్ను పడింది. ఈ క్రమంలో ధర్మకర్తల మండలి నియామక విషయంలో ఏకాభిప్రాయ సాధన దిశగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దష్టి సారించారు. ఇందులో భాగంగానే దీనిపై మంగళవారం నాగలాపురంలో నియోజవర్గంలోని వైఎస్ఆర్సిపి నాయకులతో ఎమ్మెల్యే ఆదిమూలం సమావేశం నిర్వహించి చర్చించారు. అయితే సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవిపై పలువురు వైఎస్ఆర్సిపికి చెందిన నేతలు తెరపైకి వచ్చారు. సత్యవేడు మండలానికి సంబంధించి మాజీ ఆలయ చైర్మన్ ఏవీఎం మునిశేఖర్ రెడ్డి, సెంథిల్ కుమార్, నాగలాపురం మండలానికి సంబంధించిన మురళి, సురేష్, గుణశేఖర్ రెడ్డి, పిచ్చాటూరు మండలానికి సంబంధించి భాస్కర్ నాయుడు తదితరులు పోటీ పడుతున్నట్లు సమాచారం. సురుటుపల్లి ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్గా మూడోసారి తనకు అవకాశం కల్పించాలని మాజీ ఆలయ చైర్మన్ మునిశేఖర్ రెడ్డి విన్నవించుకోగా, మిగిలినవారు కొత్తగా అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే ఆదిమూలంను కోరినట్లు తెలిసింది. అయితే వీరే గాక సత్యవేడు మండలం దాసుకుప్పం వైఎస్ఆర్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆలయ చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కాగా జిల్లా రాజకీయాలను శాసిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్లమెంట్ సభ్యులు మిథున్ రెడ్డి ఆశీస్సులు తమకే పుష్కలంగా ఉండడం వల్ల ఈసారీ తమకే ఆలయ చైర్మన్ పదవి వరిస్తుందని మాజీ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఏవీఎం మునిశేఖర్ రెడ్డి సన్నిహితుల వద్ద స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే ఈసారి ఎలాగైనా సురుటుపల్లి ఆలయ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి ఏవీఎం బాలాజీ రెడ్డి ఇప్పటికే రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపీపీ ప్రతిమసుశీల్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డితోపాటు ఇతర పలువురు వైఎస్ఆర్సిపి నేతలను కలిసి మద్దతు కూడగట్టే పనిలో నిమగ్నమయ్యారు. నేడో,రేపో పలువురు వైఎస్ఆర్సిపి నేతలతో కలిసి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి ఆశీస్సులు పొందనున్నారని తెలిసింది. అయితే ఆలయ చైర్మన్ పదవిపై పలువురు ఆశావహులు పోటీ పడుతున్న స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం సిఫార్సు, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులు పుష్కలంగా ఎవరికి ఉంటుందో వారిని సురుటుపల్లి ఆలయ చైర్మన్ పదవి వరించనున్నది అనుటలో సందేహం లేదు. ఎవరన్నది వేచి చూడాల్సిందే.

ఒకటే ముసురు

- రోజంతా ఎడతెరిపిలేని వర్షం
- నిండుతున్న చెరువులు, పొంగుతున్న వాగులు



ప్రజాశక్తి - తొట్టంబేడు: జిల్లా అంతటా ముసురు వాన కమ్ముకుంది. ప్రతి మండలంలోనూ వర్షపాతం నమోదైంది. విడవకుండా కురుస్తున్న ఈ వానకు చెరువులు జలకళతో నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. వాగులు, వంకలు కొన్నిచోట్ల ఉధృతిస్తున్నాయి. అల్పపీడనం కారణంగా వాయుగుండంగా మారడంతో భారీగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతుంది. గత రెండు రోజులుగా వర్షాలు పడడంతో ప్రజలు ఇంటిలో నుంచి బయటకి రాని పరిస్థితి నెలకొంది. బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఈ వర్షానికి జనజీవనం స్తంభించి వాహనాల సైతం బయట తిరగకుండా పలు గ్రామాల ప్రధాన రోడ్డు మార్గాలు నిర్మానుష్యంగా మారాయి. నల్లగా కమ్ముకుని తెల్లవారుజాము నుండి మధ్యాహ్నం వరకు కారు మబ్బులు కమ్ముకుని జడివాన పడుతూనే ఉన్నది. గత కొద్దిరోజులుగా క్రితం పడిన వర్షానికి ఓమోస్తరు నీరు చెరువుల్లోకి చేరింది. దీంతో రైతన్నలు రబీ సీజన్‌కు వ్యవసాయానికి ఏదోకా లేదని ఎంచక్కా వరినాట్లు వేయవచ్చని నార్లుపోసి రైతులు నాట్లను ప్రారంభించారు.

తొట్టంబేడు మండలంలో బుధవారం 17.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ నెలలో 330.4 వర్షపాతం నమోదవ్వాలి. ఇప్పటివరకు ఈ నెల అంతా 246.4 మిల్లీమీటర్ల వర్షపాతం నవంబర్ నెలలో నమోదైంది. బుధవారం కురిసిన వర్షానికి మండలంలోని కాసారం, కాళంగి రెడ్డిపాళెం ప్రాంతాల ఆనుకొని ఉన్న వాగు పొంగడంతో ఆ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. ఆ మార్గాన మూడు గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల ప్రజలు నిత్యవసర సరుకుల కోసం శ్రీకాళహస్తి పట్టణానికి రావడానికి ప్రధాన మార్గం ఆ రోడ్డు మార్గమే.... ఈ కాజ్ వే పొంగడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో 93 చెరువులు ఉన్నాయి. వాటిలో 27 పెద్ద చెరువులు ఉన్నాయి. తెలుగు గంగ నీరు చెరువులోకి చేరే ప్రతి చెరువు కలుజు పారే విధంగా నీరు ఉందని ఇరిగేషన్ ఏఈ రాజేష్ అన్నారు. మండలంలోని రౌతు సూరమాల, బోనుపల్లి, కంచనపల్లి, గౌడ మాల, కొనతనేరి, కసవర్తి, చెరువులకు జలకళ వచ్చింది. చెరువులు నిండుగా నిండి ఉన్నాయి. ఓ మోస్తరు వర్షాలు కురిస్తే కలుజులు పారే అవకాశాలు ఉన్నాయన్నారు.

కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో సిరులతల్లి

ప్రజాశక్తి-తిరుచానూరు

శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం అమ్మవారు శ్రీరాజమన్నార్ అలంకారంలో చర్నాకోలు, దండం ధరించి కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించారు.

వాహనసేవల్లో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయ్యంగార్, శ్రీశ్రీశ్రీ చిన్న జీయ్యంగార్, ఈవో ఎవి ధర్మా రెడ్డి దంపతులు, చంద్రగిరి ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, జెఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, విఎస్ఓ మనోహర్, బాలి రెడ్డి, ఏఈవో శ్రీ ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు బాబు స్వామి, సూపరింటెండెంట్ మధు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ దాము పాల్గొన్నారు.

అమ్మవారికి నూతన సూర్యప్రభ వాహనం

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉదయం నూతన సూర్యప్రభ వాహనానికి టిటిడి ఈఓ ఎవి ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జెఈవో వీరబ్రహ్మం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రూ.3 కోట్లతో 6 కేజీల బంగారు పూత తో టిటిడి నూతన సూర్యప్రభ వాహనాన్ని తయారు చేయించింది. శ్రీపద్మావతి అమ్మవారి వాహన సేవలో ఈ వాహనాన్ని వినియోగిస్తారు.

పీఠాధిపతుల నిరసన

టిటిడి ఈవో ధర్మారెడ్డి కాదని అధర్మారెడ్డి అని పలువురు



పీఠాధిపతులు ఎద్దేవా చేశారు. తిరుమలలో హిందు వులకు సంబంధించిన పీఠాధిపతులపైన నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో పీఠాధిపతికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ తిరుపతి రూరల్ మండలంలోని తనపల్లి దగ్గర ఉన్న శ్రీపంచమికి ఆశ్రమంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పీఠాధిపతులు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా సాధువులకు డబ్బుతో దర్శనం చేసుకునే భాగ్యం లేదని కేవలం తిరుమలలో మాత్రమే లక్షీ కటాక్షంతోనే దేవదేవుని దర్శనం చేసుకునే దౌర్భాగ్యం హిందువులకు కలిగిందని పలువురు పీఠాధిపతులు ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని పీఠాధిపతులపైన కక్ష సాధింపు చర్యలు విడనాడాలని లేకపోతే భవిష్యత్తులో దేశంలోని హిందువులందరూ కలిసి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ భారతీయ నంద స్వామి భారతి ఓంకార పీఠం విశాఖపట్నం, శ్రీ యోగి అతిథేశ్వరానంద శ్రీ యోగి పీఠం నిరంజన్ ఆఖర విజయవాడ, పలువురు పాల్గొన్నారు.

పంచమితీర్థం ఏర్పాట్లు పరిశీలన

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థం రోజున అన్ని విభాగాల సమన్వయంతో విజయవంతం చేయాలని టిటిడి జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. పంచమితీర్థం ఏర్పాట్లపై తిరుచానూరు అన్నప్రసాద భవనంలో బుధవారం సాయంత్రం ఆయన జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, పోలీసు, టిటిడి, పంచాయతీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, రెండు సంవత్సరాల తరువాత పంచమి తీర్థం కార్యక్రమం వర్షపరిణామ (కోనేరు)లో నిర్వహిస్తున్నందున పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని అంచనా వేసినట్లు తెలిపారు. భక్తుల రద్దీ నియంత్రించి అందరికీ కోనేరులో పవిత్ర స్నానం చేసే అవకాశం కల్పించాలని చెప్పారు.



27న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాక

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈనెల 27, 28 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27న నాగపూర్ నుంచి బయల్దేరి రాత్రి 7.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, తిరుమలలో బస చేస్తారు. 28న శ్రీవారిని, తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుని,10.30 గంటలకు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే జాతీయ రహదారుల కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం తిరిగి నాగపూర్‌కు వెళ్తారు.

నేడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాక

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ ఈనెల 24, 25 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 24న రాత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుమలలో బస చేస్తారు. 25న శ్రీవారిని, తిరుచానూరు అమ్మవారిని దర్శించుకుని మధ్యాహ్నం తిరుగు ప్రయాణం అవుతారు.

టీటీడీ గోడౌన్లను తనిఖీ చేసిన జేఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలోని టీటీడీ గోడౌన్లను జేఈవో సదాభార్గవి బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్లలోని బియ్యం, జీడిపప్పు, కందిపప్పు, వంట నూనెలు తదితర సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, గోడౌన్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అవసరమైన చోట గోడౌన్లకు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం తల వెంట్రుకలు నిలువ చేసే గోడౌన్ తనిఖీ చేశారు. శ్రీవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను పరిశీలించి, త్వరితగతిన టెండర్లు పిలిచి వాటిని విక్రయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో మార్కెటింగ్ డిప్యూటీ ఈవో పద్మావతి, జిఎం (కొనుగోలు) కృష్ణారెడ్డి, ఇఇ సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంచు విష్ణు జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మా అధ్యక్షులు మా డైనమిక్ స్టార్ మంచు విష్ణువర్ధన్ బాబు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మంచు యువసేన అధ్యక్షులు యం. సునీల్ చక్రవర్తి ఆధ్వర్యంలో విద్యానికేతన్ ప్రాంగణంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గజమాల, దుశ్శాలువతో హీరో మంచు విష్ణును అభిమానులు సత్కరించారు. ఈ వేడుకల్లో మంచు అరియానా, వివియానా, అవిరాంభర్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు పలని, యశ్వంత్, మురళి, సాయి యాదవ్, లాల తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్‌గా షేక్ అబ్దుల్

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్‌గా వరదయ్యపాలెంకు చెందిన షేక్ అబ్దుల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేసిన రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు ఖాదర్ బాషా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈ పదవులకు సంబంధించిన పత్రాలను అందజేశారు. కాగా అబ్దుల్ ప్రస్తుతం వైఎస్ఆర్‌సిపి మండల ముస్లిం మైనారిటీ కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. పార్టీకి షేక్ అబ్దుల్ చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం ఈ పదవిని కట్టబెట్టింది.



26న జిల్లాస్థాయి కౌశల్ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఈనెల 26వ తేదీన పుత్తూరులోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో తిరుపతి-చిత్తూరు ఉమ్మడి జిల్లాల స్థాయి కౌశల్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ లత, ఆర్గనైజింగ్ మెంబర్స్ సౌజన్య, కల్పన తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండు జిల్లాల నుంచి 72 టీమ్ లు పోటీలలో పాల్గొననున్నాయని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి చిత్తూరు తిరుపతి జిల్లాల విద్యాశాఖ అధికారుల నుంచి బహుమతులు ప్రదానం చేయనున్నామన్నారు. జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్‌ను కలిసి వారు ఆహ్వానించారు.

క్యాట్ పరీక్షల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి క్యాట్ పరీక్షల్లో 170 మంది విద్యార్థులకు గాను 72 మంది సెకండ్ లెవెల్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ రవికిరణ్ తెలిపారు. బుధవారం జాతీయస్థాయి పరీక్షల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఏ.జీ.యం శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్, శరవణ, అకడమిక్ డీన్ తిరుమావళవన్, డెన్ ఇంఛార్జి యోగేశ్వరి, రూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు వేలంపాట.. మా పంచాయతీలోనే నిర్వహించాలి

సర్పంచ్ కవిరి లలితమ్మ

ప్రజాశక్తి - ఓజిలి: చెరువు వేలం పాటను మా పంచాయతీలో నిర్వహించాలని గ్రామ సర్పంచి కవిరి లలితమ్మ వినతి పత్రాన్ని మండల పరిషత్ అధికారులకు



బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంకటరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న విజయ నెల్లూరు చెరువుకు సంబంధించిన వేలం పాటను ఈనెల 24వ తేదీన కొండవల్లిపాడు గ్రామంలో నిర్వహించడం తగదన్నారు. ఆయకట్టుదారులు ఈ చెరువుకు సంబంధించిన గత ఏడాది కూడా వెంకటరెడ్డిపాళెం పంచాయతీలో నిర్వహించారని పేర్కొన్నారు. అధికారులు ప్రస్తుతం సంబంధించిన పంచాయతీలో అంతర్యాగమైన విజయ నెల్లూరు చెరువు వేలం పాటను రద్దుచేసి ఈ చెరువుతోపాటు వెంకటరెడ్డిపాళెం పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులు అన్నింటినీ ఒకే రోజు ఒకే చోట నిర్వహించాలని వినతి పత్రంలో కోరారు. వైసిపి యువ నాయకులు బట్ట అనిల్ కుమార్ యాదవ్, బట్ట పుట్టి కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

కన్నావరంలో గ్రావెల్ క్వారీలను రద్దు చేయండి : సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - సత్యవేడు: మండలంలోని పలు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న గ్రావెల్ క్వారీలను రద్దు చేయాలని సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో సత్యవేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నివాస ప్రాంతాలకు దగ్గరగా క్వారీలకు అనుమతులు మంజూరు చేయడం వల్ల క్వారీ నిర్వాహకులు యథేచ్చగా చట్టాన్ని ఉల్లంఘించి గ్రావెల్‌ను తవ్వుకుంటున్నారని విమర్శించారు. పరిమితికి మించి రవాణా చేయడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయన్నారు. తక్షణమే అధికారులు అక్రమంగా నిర్వహిస్తున్న గ్రావెల్ క్వారీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ కన్నావరం గ్రామంలో 'రెడ్' మార్కులో ఉన్న డికెటి భూములను సైతం తహశీల్దార్ చట్టాన్ని అతిక్రమించి దళితుల దగ్గర, వెనకబడిన తరగతులకు చెందిన అసైన్డ్, డికెటి పట్టాలను పీఓటి యాక్ట్ కు వ్యతిరేకంగా రద్దు చేసి క్వారీ యజమానులకు ఎన్ఓసి ఇస్తున్నారని విమర్శించారు. అధికార



పార్టీ అండతో దౌర్జన్యంగా క్వారీలకు భూసేకరణ చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు డి.అరుణాచలం మాట్లాడుతూ కన్నావరం, రాజగుంట, చెన్నేరి, ఇరుగుళం, వానెల్లూరు తదితర గ్రామాల్లో గ్రామాలకు అతి సమీపంగా క్వారీలను నిర్వహిస్తున్నారన్నారు. అంబేద్కర్ ఆర్మీ నాయకులు, న్యాయవాది రాజా, అశోక్‌లు ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. సిపిఎం నాయకులు జె.రాము, మునస్వామి, శేఖర్, తిరుమల, మురగన్, బాలయ్య, రామస్వామి పాల్గొన్నారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన ఆర్డీవో

ప్రజాశక్తి -గూడూరు రూరల్: భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కిరణ్ కుమార్ గూడూరు ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆర్డీవో ఏరియా ఆసుపత్రి పరిశీలనకు వచ్చిన సమయంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సెలవులో ఉండటంతోపాటు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ కూడా సెలవులో ఉన్నారు. దీంతో ఇన్‌చార్జ్ డాక్టర్ లత డ్యూటీ డాక్టర్ ప్రవీణ్‌లతో కలిసి ఆర్డీవో ఆసుపత్రిని పరిశీలించారు. మెడికల్ స్టోర్‌లో అందుబాటులో



వున్న స్టాక్‌ను, ఉపయోగించిన స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్ రూమ్‌లో యాంటిబయోటిక్స్ (పాము కాటు, తేలుకాటు, కుక్కకాటు, ఇతరత్రా) సంబంధించిన మందులు, బ్లడ్ బ్యాంక్‌లో ప్రస్తుతం స్టాక్ వివరాలు అడిగిదిగా స్టోరేజ్‌ను కూడా పరిశీలించారు.ఈ తనిఖీలో వైద్య సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

సైన్స్‌పట్ల అవగాహన పెంచుకోవడానికే వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి, సైన్స్ పట్ల అవగాహన ఆసక్తిని పెంచుకోవడానికి సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని సైన్స్ కో-ఆర్డినేటర్ తాతికొండ శాలిని మహేష్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి నగర పరిధిలోని బైరాగిపట్టెడ మహాత్మా గాంధీ నగరపాలక ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను మండల స్థాయికి, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయికి, అలాగే జిల్లా స్థాయి నుండి



రాష్ట్రస్థాయికి పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణశ్రీ, తులసి ప్రకాష్, బండి మధుసూదన రెడ్డి, మురుగన్, రవికుమార్, రవి, బాలకృష్ణ, పుష్పలత, ఖదరున్నిసా బేగం, గిరిజ, మాధవి, శ్రీ లక్ష్మి, యామిని పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టును కొనసాగించాలి

-కలవగుంట భరత్ రెడ్డి

ప్రజాశక్తి -తొట్టంబేడు: తొట్టంబేడు ఐసీడీఎస్ ప్రాజెక్టును కొనసాగించాలని వైసీపీ నేత కలవగుంట భరత్ రెడ్డి డిమాండ్ చేశారు. తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొట్టంబేడు ఐసీడీఎస్ పరిధిలో తొట్టంబేడులో 80, బీఎన్‌కండ్రిగలో 59, కేవీబీపురంలో 61 మొత్తం 200 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. కలిపి మిగిలిన బీఎన్‌కండ్రిగను సూళ్లూరుపేటకు, కేవీబీపురం మండలంలోని అంగన్ వాడీ కేంద్రాలను పిచ్చాటూరు కొత్త ప్రాజెక్టులో విలీనం చేయాలన్నారు. శ్రీకాళహస్తిలో ఒక భాగమైన తొట్టంబేడును పిచ్చాటూరులోకి కలపడం శ్రీశ్రేయం కాదన్నారు. భవిష్యత్తును, అంగన్ వాడీ కార్యకర్తల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గూడూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం అందించి చేయూత గూడూరు జ్యువెలర్ అండ్ పాన్ బ్రోకర్ల అసోసియేషన్ ముందుకు రావడం



అభినందనీయమని గూడూరు డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. బుధవారం గూడూరు పట్టణంలోని సబ్‌డివిజనల్ పోలీస్ కార్యాలయంలో జ్యువెలర్ అండ్ పాన్ బ్రోకర్ అసోసియేషన్ దాతృత్వంతో రోడ్డు ప్రమాదంలో గాయపడి అనారోగ్యంతో ఉన్న అఖిల్ అనే యువకుడికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎల్లరిరి గోపాల్ రెడ్డి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సోమిశెట్టి చెంచురామయ్య, పొట్టేటి సురేష్, తాంగిటి సురేష్ పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలోని విప్పమాను పట్టెడ గ్రామపంచాయతీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. బుధవారం పార్లు కిరణ్ జయంతి సందర్భంగా అమ్మ పార్టీ ఫాల్స్ అధినేత, రాయలచెరువు పార్లు కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత అరిడి సుబ్రహ్మణ్యం రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటించారు. అదేవిధంగా స్కూల్ పిల్లలకు అందరికీ బహుమతులు, స్వీట్లు అందజేశారు. సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి, సచివాలయ సెక్రెటరీ సిబ్బంది, అదేవిధంగా పాఠశాల హెడ్ మాస్టర్, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ టీచర్, పిల్లలు పాల్గొన్నారు.


గర్భిణులకు ఆహారం..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో బుధవారం గర్భిణి లకు, బాలింతలకు పోషకాహారం పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి బుధవారం భోజనం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్మన్ ఏ.హరి, వైస్ ఛైర్మన్ డి.ఆయ ప్రకాష్, హాస్పిటల్ కమిటీ మెంబర్ నారాయణ స్వామి, వైసీపీ నాయకులు మునెయ్య, రూరల్ మండలానికి సంబంధించిన నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి-బీఎన్‌కండ్రిగ: మండల కేంద్రం లోని కారణి వరుసగా గ్రామాలలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని మండలస్థు జాగ్రత్తగా గ్రామ సర్పంచ్ సుప్రియ దయాకర్ ఆధ్వర్యంలో వైద్యాధికారి దివాకర్ వైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండలంలో గత కొన్ని వారాలుగా వర్షాలు అధికంగా కురవడం వలన సీజన్ జ్వరాలు ప్రబలకుండా బుధవారం వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఎఎన్ఎం హేమావతి, వైద్య సిబ్బంది మల్లేశ్వరి, ఆశ వర్కర్ గంగమ్మల ఆధ్వర్యంలో ఉచిత వైద్య క్యాంపు నిర్వహించి వైద్య సేవలు అందించారు.



విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి: కార్పొరేటర్ గీత

తిరుపతి టౌన్: విద్యతో పాటు విద్యార్థులు ఆరోగ్యంగా దృఢంగా ఉండాలని కార్పొరేటర్ గీత తెలిపారు. నగరపాలక ప్రాథమిక పాఠశాల పట్టాభి పురం వీధిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు బుధ వారం జరిగాయి. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపా ధ్యాయులు మునికృష్ణయ్య, తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖ అధికారి హెచ్.ప్రభాకరరాజు పాల్గొన్నారు.

నేడు మహిళా వర్సిటీలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఉమెన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో యుజిసి జాతీయ సదస్సును రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు సదస్సు కన్వీనర్ డాక్టర్ పి.మాధవి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుజిసి సహకారంతో 24, 25 తేదీలలో జాతీయ సదస్సును "ఇండియాస్ మాక్రో ఎకనామిక్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ "అనే అంశంపై వర్సిటీలోని సావిత్రి అతిథి గృహంలోని సెమినార్ హాల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున, కీనోట్ స్పీకర్‌గా విక్రమ సింహపురి మాజీ ఉపకులపతి ఆర్.సుదర్శనరావు, గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా వర్సిటీ కుల సచివులు ఆచార్య డి.ఎం.మమత హాజరవుతున్నారని వెల్లడించారు. జాతీయస్థాయిలో దాదాపుగా 150 మంది పైగా పరిశోధకులు పత్ర సమర్పణలు వివిధ రంగాల వారీగా సమర్పిస్తున్నట్లు తెలిపారు.

సుబ్బయ్యకు పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్యను బుధవారం ఆ పార్టీ నేతలు పరామర్శించారు. అక్రమ కేసులకు భయపడొద్దని ధైర్యం



చెప్పారు. సుబ్బయ్యపై వైసీపీ నేతలు కేసు పెట్టడాన్ని ఖండించారు. సుబ్బయ్యకు కోర్టు బెయిల్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారిందన్నారు. వేధింపు రాజకీయాలకు ఒడిగడుతున్నారంటూ మండిపడ్డారు. వాళ్లకు గుణపాఠం చెప్పే రోజు త్వరలోనే ఉందని హెచ్చరించారు. ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ ఎం.దారునాయక్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కళావతి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి విజయ్ కుమార్ నాయక్, చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుధాకర్ నాయక్, ఎస్సీ సెల్ కార్యదర్శి మనోహర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యుత్ రాయితీ, దాణా ధరలు తగ్గించడంతో పాటు రొయ్యలకు మద్దతు ధర ప్రకటించి సంక్షోభంలో పడిన ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అంజూరు చక్రధర్ మాట్లాడుతూ ఆక్వా రంగ రైతులు తీవ్ర నష్టాలతో అప్పుల పాలవుతున్నారన్నారు. రొయ్యల పెంపకం చేపట్టి అప్పుల పాలయ్యే బదులు ఆక్వా హాలిడే వైపు మొగ్గు చూపడం అందోళన కలిగిస్తోందని వాపోయారు. తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆక్వా రంగాన్ని ఆదుకోవడానికి ఉదారంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో కొత్త చట్టాలు తెచ్చి వేధింపులకు గురిచేయడం, ఆక్వా రంగం రైతుల్ని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం ఉద్యోగప్రాతిపదికపై స్పందించి ఆక్వా రైతులందరికీ యూనిట్ విద్యుత్తును రూ.1.50 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన రొయ్య పిల్లలను సరఫరా చేయడంతో పాటు దాణా రేట్లు తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెరిగిన ఉత్పత్తి వ్య యానికి 50 శాతం కలిపి రొయ్యలకి మద్దతు ధర ప్రకటించాలని కోరారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కారం

ఆనందంలో ఎగువగుకురు దళితులు: కెవిపిఎస్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మం డలంలోని తడుకు పంచాయతీ ఎగువ గుకురు గ్రామం లో గత నవంబర్ 16వ తేదీ శ్మశాన ఆక్రమణకు గురవ్వ డంపై కెవిపిఎస్ ధర్నా నిర్వహించడంతో



స్పందించిన తహశీల్దార్, సర్వేయర్, వీఆర్వో హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే నెంబరు 89లోని సిరుగురాజు పాలెం లెక్క దాఖలాలోని ఆక్రమణకు గురై 40 సంవత్సరాలుగా ఉన్న శ్మశాన సమస్యను పరిష్కరించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జి.వసంతమ్మను ఆ స్థలంలో దహనక్రియలు చేశారు. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాకు ఎగువ గుకురు దళితులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్, గ్రామస్థులు వి.గోపాల్, టి.మన్నారు, ఎ.అరటి బాబు, టి.వెంకయ్య, కే.కృష్ణ, జి.దొరస్వామి, మాజీ ఎంపీటీసీ జి.దనపాల్, వై.బొజ్జయ్య, టి.మారయ్య తదితరులు పాల్గొన్నారు.

జడ్జి రాఘవేంద్రకు ఘన వీడ్కోలు


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్రకు సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొందారు. పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జిగా ఆయన బాధ్యతలు



చేపట్టనున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి రాఘవేంద్రకు ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి మాట్లాడుతూ న్యాయమూర్తి రాఘవేంద్రకు పదోన్నతి రావడం సంతోషంగా ఉందన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నరేంద్ర రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కట్టా సుధాకర్ రెడ్డికి మంత్రి పెద్దిరెడ్డి ఆశీర్వాదం

ప్రజాశక్తి-నాయుడుపేట: సొంత కార్యక్రమాల నిమిత్తం నవంబర్ 30వ తేదీ విదేశాలకు (అమెరికా)కు వెళ్తున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్ రెడ్డిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీర్వ దించారు. బుధవారం



ఉదయం కట్టా సుధాకర్ రెడ్డి విదేశాలకు వెళుతున్న సందర్భంగా తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను అమెరికాకు వెళుతున్నట్లు మంత్రికి వివరించారు. మంత్రి పెద్దిరెడ్డి మనస్ఫూర్తిగా ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ్నుంచి తిరుపతి ఎంపీ మద్దెల. గురుమూర్తి నివాసానికి చేరుకుని ఎంపీని కలిశారు.నాయుడుపేట మాజీ వైస్ ఎంపీపీ, నల్లు కస్తూరయ్య, ఓజిలి మాజీ జెడ్పిటిసి సభ్యులు ముమ్మడి సుబ్బారాయ మంత్రిని, ఎంపీని కలిశారు.

ఇసుక మాఫియాపై తహశీల్దార్ ఉక్కుపాదం

ఐదు ట్రాక్టర్లు, భారీగా ఇసుక డంపు సీజ్

ప్రజాశక్తి- రేణిగుంట: మండలంలోని ఎస్సార్ పట్టెడ కుట్రమంగళం పంచాయతీలలో అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న మాఫియాపై రేణిగుంట తహశీల్దార్ శివప్రసాద్ ఉక్కుపాదం మోపారు. కుట్ర మంగళం వద్ద



భారీగా డంప్ చేసిన ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని సమాచారం అందుకున్న తహశీల్దార్ తన సిబ్బందితో గాజులమండ్యం పోలీసుల సాయంతో దాడులు నిర్వహించారు.150 టిప్పర్ల సరిపడా భారీ ఇసుకడంపును అలాగే ఐదు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను గాజుల మండ్యం పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఈ దాడుల్లో డిప్యూటీ తహశీల్దార్ ప్రేమ్ కుమార్, ఆర్ఐ దిలీప్, వీఆర్వోలు హేమంత్ సుందరయ్య, రామయ్య, సర్వేయర్లు, సురేష్ కృష్ణంరాజు, గాజుల మండ్యం పోలీసులు, రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు.